సాక్షి చిత్తూరు

గురువారం । 10 । ఆగస్టు । 2023



గిరిజనాభివృద్ధికి సర్కార్ కృషి

గిరిజనాభివృద్ధికి వైఎస్సార్ సీపీ సర్కారు కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. - 8లో



వేగవంతంగా ఓటర్ల సర్వే

డోర్ టు డోర్ ఓటర్ల సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం అధికారులతో సమీక్షించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	34	26
తిరుమల	29	21
గూడూరు	7	27
నగరి	35	26

న్యూస్‌రీల్

కాణిపాకంలో ఆడికృత్తిక రద్దీ



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): స్వయంభూ కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిట లాడింది. ఆడికృత్తిక సందర్భంగా ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కంపార్ట్‌మెంట్‌లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు త్వరితగతిన దర్శనం చేసుకునేలా దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, చంటి పిల్లల తల్లి దండ్రులకు ప్రత్యేక క్యూల ద్వారా దర్శనం కల్పించారు.

నేటి నుంచి ఆల్బెండజోల్ పంపిణీ



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని గురువారం పకడ్బందీగా నిర్వహించాలని, గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. బుధవారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విధిగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే, పోగ్రామింగ్ అధికారులు నిరంతరం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయుల బృందం సమన్వయంతో పనిచేసేలా చూడాలని తెలిపారు. నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 17వ తేదీ కల్లా వందశాతం ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్, డీఎంఓ శ్రీనివాసులు, డీపీఎంఓ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

నేటి నుంచి మొక్కల పెంపకం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో గురువారం నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ రకాలకు చెందిన 52, 275 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మండలాలకు దానిమ్మ, ఉసిరి, జామ, వేప, ఇతర మొక్కలు సరఫరా చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పెంపకం, సంరక్షణ బాధ్యతలు చూడాలని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్వీయూ అధికారి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్) : పెనుమూరులోని ఒక ప్రైవేటు డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల కేంద్రాన్ని బుధవారం ఎస్వీ యూనివర్సిటీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ ఎ.కిషోర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్, ఎవల్యూషన్ ఏఓ కె.జితేంద్రనాయక్ పరీక్షల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

రెండో రోజు 25 నామినేషన్లు

– నేడు తుది గడువు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 3 పంచాయతీల సర్పంచ్, 46 వార్డు సభ్యుల పదవుల ఎన్నికలకు సంబంధించి రెండో రోజు బుధవారం 25 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి రోజు మంగళవారం సెంటిమెంట్‌తో ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు. రెండో రోజు బుధవారం జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. విజయపురం మండలం కాళికాపురం పంచాయతీ, కార్వేటినగరం మండలంలోని కత్తిరపల్లె పంచాయతీ సర్పంచ్ స్థానాలకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. 23 వార్డు సభ్యుల స్థానాల కోసం 25 మంది దరఖాస్తు చేశారు. గురువారం నామినేషన్ల దాఖలుకు చివరి గడువని డీపీఓ లక్ష్మి తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన, 12న తిరస్కరణకు అవకాశం, 13న పరిశీలన, 14న ఉపసంహరణ, అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్



కల్యాణమస్తు!

- ఘనంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా జిల్లా స్థాయి కార్యక్రమం
- జిల్లాలో మూడో విడతలో 444 మందికి రూ.3.60 కోట్ల లబ్ధి
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పేదింటి ఆడపిల్లల పెళ్లికి వైఎస్సార్ సర్కారు అందిస్తున్న సాయం గొప్పదని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం తాడేపల్లె నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా మూడవ విడత పథకాన్ని సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ పేదవర్గాల తల్లిదండ్రులు తమ పిల్లల వివాహాన్ని గౌరవప్రదంగా నిర్వహించేందుకు సీఎం బాసటగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారించి, పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ, పేద కుటుంబాలకు చెందిన వధువులకు ప్రభుత్వం అండగా ఉంటోదన్నారు. టీడీపీ పాలనలో ఎన్నికల సమయంలో మాట ఇచ్చి పథకాన్ని అమలు చేయకుండా మోసం చేశారని చెప్పారు. ప్రస్తుతం ఇచ్చిన మాట ప్రకారం ఏటా పథకాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ ఈ పథకంతో ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా, పదవ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి నిబంధనతో పిల్లల చదువులకు ప్రోత్సాహం కలుగుతోందని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ లబ్ధిదారుల తల్లుల ఖాతాలకు రూ.40 వేల నుంచి రూ.1,50,000 వరకు అర్హులైన వివాహ జంటలకు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. జిల్లాలో మూడవ విడత 444 మందికి రూ.3.60 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం మెగా చెక్కును ఆవిష్కరించారు. పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రమ్య, జెడ్పీ మహిళా స్థాయి సంఘం చైర్ పర్సన్ భారతి, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి రాజ్యలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామాజిక వర్గాల వారీగా . . .

182 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.1.85 కోట్లు, 15 మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ.15 లక్షలు, 187 మంది బీసీ లబ్ధిదారులకు రూ.98 లక్షలు, 52 మంది మైనారిటీలకు రూ. 52 లక్షలు, భవన, ఇతర నిర్మాణ కార్మికులకు చెందిన ఒకరికి రూ.40 వేలు, ఏడుగురు విభిన్న ప్రతిభావంతులకు రూ.1.50 లక్షలు, మొత్తం 444 మందికి రూ.3.60 కోట్లు లబ్ధి చేకూరింది.

చాలా మంచి పథకం



పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకునేందుకు అందిస్తున్న వైఎస్సార్ కల్యాణ మస్తు మంచి కార్యక్రమం. ఆడపిల్లలకు పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఎన్నో బాధలు పడాల్సి వస్తుంది. బీసీ కులానికి చెందిన నాకు నాలుగు నెలల క్రితం గోవింద స్వామితో వివాహం జరిగింది. పథకం గురించి వలంటీర్లు తెలియజేశారు. వెంటనే దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వ సాయం పొందుతున్నందుకు సంతోషంగా ఉంది.

– సీఎంతో వర్చువల్ విధానంలో సంతోషం వ్యక్తం చేసిన సుమతి దంపతులు, కొప్పూరు(యాదమరి)

సీఎం జగనన్న మేలు మరువం



ఆడ పిల్లలకు పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఎంతో ఆర్థిక భారంతో కూడిన విషయం. ఇలాంటి ఎంతో మంది తల్లిదండ్రుల ఆర్థిక భారం తగ్గించేందుకు వైఎస్సార్‌ఆర్ కల్యాణ మస్తు ఆదుకుంటోంది. డిగ్రీ ఫస్ట్ ఇయర్ వరకు చదువుకున్న ఎస్సీ కులానికి చెందిన నాకు యశ్వంత్‌తో వివాహం జరిగింది. ఈ పథకం కింద ప్రభుత్వం ఒక లక్ష అందిస్తోంది. ఈ ఆర్థిక లబ్ధితో ఉపాధికి మార్గం దొరికింది. సీఎం జగనన్న మేలును ఎప్పటికీ మరువం

– పవిత్ర, తవణంపల్లె

కావడి మొక్కులు చెల్లించిన రోజా



కావడితో మంత్రి ఆర్కే రోజా

నగరి : ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా కావడి మొక్కులు చెల్లించారు. ఉదయం ఇంట్లో సంప్రదాయబద్ధంగా పసుపు చీర ధరించి సుబ్రమణ్యస్వామి వ్రతమాచరించారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన కావడిని భుజాలపై మోసుకుంటూ కుటుంబ సమేతంగా రాష్ట సరిహద్దును ఆనుకుని ఉన్న తమిళనాడులోని ప్రసిద్ధ శ్రీసుబ్రమణ్యస్వామి స్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. శ్రీసుబ్రమణ్యస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొని, కావడి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆర్కేరోజాను, ఆమె భర్త ఆర్కే సెల్వమణి, సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, కుమారుడు కృష్ణకౌశిక్‌ను ఆలయ పురోహితులు ఆశీర్వదించారు.

సుబ్రమణ్యస్వామికి కాణిపాకం పట్టువస్త్రాలు



పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్ రెడ్డి, కాణిపాక ఆలయ అధికారులు

- చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డితో కలిసి సమర్పించిన దేవస్థానం అధికారులు

కాణిపాకం(యాదమరి): పాకాల మండలం ఊట్లవారిపల్లెలోని ప్రముఖ శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయానికి ఆడికృత్తిక సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు. అదే సమయంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మోహిత్‌రెడ్డి కూడా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించేందుకు ఊట్లవారిపల్లె విచ్చేశారు. ఎమ్మెల్యే, కాణిపాకం దేవస్థానం అధికారులు పట్టు వస్త్రాలతో కలసి వెళ్లగా సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ పట్టాభిరెడ్డి, ఈఓ మునిశేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారు అందజేసిన పట్టు వస్త్రాలను శ్రీ సుబ్రమణ్యస్వామి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ చైర్మన్,ఈఓ తీర్థ ప్రసాదాలు అందించారు. కాణిపాక దేవస్థానం ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పుణ్యభూమి నాదేశం నమో నమామి...



నా భూమి-నాదేశం శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఘనంగా నా భూమి-నాదేశం, నేల తల్లికి..., వీరులకు వందనం
- కలెక్టరేట్‌లో శిలాఫలకం ఆవిష్కరణ
- స్వాతంత్య్ర సమరయోధుడు టీసీ రాజన్, కార్గిల్ సైనికులకు, వీరనారీమణులకు ఘన సత్కారం

చిత్తూరు కలెక్టరేట్ : దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన వీరులను స్మరించుకోవడం అందరి బాధ్యతని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆజాదీ కా అమృత్ దినోత్సవ్‌లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో నా భూమి-నాదేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తిని పెంపొందించడంతోపాటు స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్రలు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో 75 మొక్కలను నాటి, మట్టిని సేకరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశాన్ని గౌరవించాలన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు రాష్ట్రంలో ఈనెల 25వ తేదీ వరకు, దేశవ్యాప్తంగా ఈ నెల 30 వరకు జరుగుతాయన్నారు. వారం రోజులు ప్రతి రోజూ ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. దేశ ఐక్యతను, జాతి ఔన్నత్యాన్ని చాటే విధంగా అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ లోపు ప్రతి గ్రామంలో కొంత మట్టిని కలశాల ద్వారా సేకరించి నియోజకవర్గానికి, అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నా భూమి-నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలను నాటారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులను, వీరనారీమణులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమర్‌రాజా, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనేక పోరాటాల్లో పాల్గొన్నా..



టీసీ రాజన్‌ను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే శ్రీనివాసులు

స్వాతంత్య్ర సమరయోధుడు టీసీ రాజన్ (106) మాట్లాడుతూ రాజకీయంలో దాతృత్వం ముఖ్యమన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం జరిగే సమయంలో తాను విద్యార్థిగా ఉన్నట్లు చెప్పారు. స్వాతంత్య్రం కోసం అనేక పోరాటాల్లో పాల్గొన్నాని తెలిపారు. స్వాతంత్య్రం తరువాత దేశానికి ఒక చట్టం ముఖ్యమని భావించి రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఉండే అన్ని దేశాలకంటే భారతదేశం చట్టమే చాలా గొప్పగా ఉన్నట్లు అప్పట్లో పేరొచ్చిందన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ప్రస్తుతం ఎన్ని కులాలున్నాయో...అన్ని రాజకీయ పార్టీలున్నాయన్నారు. అంత సులువుగా రాజకీయాల్లో గెలుపొందే అవకాశాలు లేవని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పేదలకు ఎన్నో సేవలు చేసి నట్లు తెలిపారు. తాను మృతి చెందాక అవయవాలను మరొకరికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో అవయవ దానానికి రాసిచ్చానని తెలిపారు.

మార్మోగిన హరోహర నామస్మరణ




ఎస్కాట్‌లతో కావళ్లు చెల్లిస్తున్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని గుడివంకలో వెలసిన ప్రముఖ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కొండ ప్రాంతం హరో హర..వేల్ మురుగా నామస్మరణతో మార్మోగింది. బుధవారం ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గుడివంక ఆలయానికి భక్తులు పోటెత్తారు. కావళ్లతో వచ్చిన భక్తులు పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి, పశ్చిమ వాహిని కొండపైకి చేరుకుని మొక్కులు చెల్లించారు. భక్తులు ఆడిమాసం ప్రారంభం నుంచి ఆడికృత్తిక వరకు ఉపవాస దీక్షలతో ఉంటూ చివరి రోజున గంగ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వివిధ ఆకృత్తులతో కావడి మొక్కులు చెల్లింపు

కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామి వారికి పలు ఆకృతుల కావళ్లతో మొక్కుబడులు చెల్లించారు. తేరు కావళ్లు, రాగి గుండులు, ఇనుప శూలాలు, నిమ్మకాయలతో సూదులు శరీరానికి గుచ్చుకుని ఆలయం ఎదుట కావడి మొక్కులు చెల్లించారు. అలాగే కొందరు భక్తులు ఎస్కాట్ వాహనంపై తమ వీపులకు కొక్కీలతో వేలాడుతూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గుడివంక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీగంగాధరేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. కొండపై సుబ్రమణ్యస్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు గంగాధరేశ్వరస్వామి దర్శించుకుని గ్రామాలకు తిరుగుముఖం పట్టారు.



ఆలయం వద్ద భక్తజన సందోహం

షిర్డీ ఎక్స్‌ప్రెస్ వచ్చేస్తోంది..

- 6 నుంచి కుప్పంలో స్టాపింగ్
- ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప చొరవతో తీరిన దశాబ్దాల సమస్య



కుప్పం: మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న కుప్పం రైల్వే స్టేషన్‌లో షిర్డీ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌తో ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కలనెరవేరనుంది. స్థానికుల ఏళ్లనాటి సమస్యపై ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప దృష్టికి ఎమెల్సీ భరత్ తీసుకెళ్లారు. రెల్వే బోర్డు మెంబర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు రెడెప్ప అప్పటి రైల్వే అధికారులకు నివేదిక కూడా ఇచ్చారు. దీనిపై స్పందించిన రైల్వే శాఖ చెన్నై నుంచి షిర్డీ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 6వ తేదీ నుంచి కుప్పం రైల్వే స్టేషన్‌లో నిలిపేలా అనుమతులను మంజూరు చేసింది. ఆరేళ్లుగా షిర్డి ఎక్స్‌ను కుప్పంలో నిలపాలని స్థానిక సాయిమాత సేవా ట్రస్టు సభ్యులు జగదీష్ బాబు, పలువురు స్థానికులు రైల్వే అధికారులకు వినతులు చేసుకుంటున్నా ఫలితం లేకపోయింది. చివరకు ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఇచ్చినా లేఖపై రైల్వే అధికారులు స్పందించారు. దీనిపై కుప్పం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు మాట్లాడుతూ సెప్టెంబర్ 6 తేదీ నుంచి ప్రతి బుధవారం మధ్యాహ్నం 2.14 గంటలకు కుప్పంలో షిర్డి ఎక్స్‌ప్రెస్ ఆగుతుందని, మురుసటి రోజు గురువారం ఉదయం 11.25 గంటలకు షిర్డి చేరుకుంటుందన్నారు. ఇదే ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 8.25 గంటలకు షిర్డిలో బయలుదేరి శనివారం ఉదయం 4.45 నిమిషాలకు కుప్పం చేరుకుంటుందని వెల్లడించారు.

ముగిసిన అంగన్‌వాడీల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : అంగన్‌వాడీ పోస్టుల ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థినులకు బుధవారం ఇంటర్వ్యూలను పకడ్బందీగా నిర్వహించారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఆర్డీవో రేణుక, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు 120 మంది హాజరైనట్లు చెప్పారు. నిబంధనల మేరకు పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

నిందితుడు పరారీకి యత్నం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలిస్తూ సెబ్ పోలీసులకు పట్టుబడిన నిందితుడు స్టేషన్ నుంచి పరారీ అయ్యేందుకు ప్రయత్నించిన సంఘటన బుధవారం పలమనేరులో చోటుచేసుకుంది. యాదమరికి చెందిన ఢిల్లీ ప్రసాద్ బైక్‌లో కర్ణాటక నుంచి 25 టెట్రా ప్యాకెట్లను తెస్తుండగా సెబ్ అధికారులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో విధి నిర్వహణలో అధికారులు బిజీగా ఉన్న సమయంలో నిందితుడు తప్పించుకునేందుకు యత్నించాడు. గమనించిన సిబ్బంది పట్టుకుని, అరెస్ట్ చూపారు. పొలంలో కూలి పనులకు వచ్చే కూలీలకు తీసుకొచ్చానని, కేసు అయితే పరువుపోతుందనే పారిపోయేందుకు ప్రయత్నించానని నిందితుడు చెప్పడం కొసమెరుపు. సెబ్ సీఐ ఎల్లయ్యను మాట్లాడుతూ నిందితుడు మద్యం విక్రయించేవాడు కాదన్నారు. అయినా మద్యంతో పట్టుబడడంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

గిరిజనాభివృద్ధికి సర్కారు కృషి

- కలెక్టరేట్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- గిరిజనులకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి
- సంప్రదాయ నృత్యాలతో అలరించిన గిరిజనులు
- కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : గిరిజనాభివృద్ధికి వైఎస్సార్ సీపీ సర్కారు కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతం ఇస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గిరిజనుల అభున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రోత్సాకాలను అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ నుంచి విదేశీ విద్య వరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసి విద్యకు ప్రాధాన్యతం ఇస్తోందన్నారు. అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న విదేశీ విద్య పథకం ద్వారా విదేశాలల్లో చదువుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

చదవే ఆస్తి..

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ తన మొదటి పోస్టింగ్‌లో గిరిజన ప్రాంతాల్లో పని చేశాననిజరిగిందన్నారు. అక్కడ పనిచేయడం వల్ల గిరిజనుల జీవన విధానం, స్థితిగతులు, కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రతి గిరిజన కుటుంబంలో పిల్లలందరినీ బడికి పంపించి చదివించాలన్నారు. పిల్లలను చదివిస్తేనే వారి జీవితాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గిరిజనులందరికీ ఆధార్ కార్డులుండాలన్నారు. ఆధార్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నట్లు చెప్పకూడదన్నారు. ఆధార్‌కార్డు లేని వారున్నట్‌లైతే వివరాలు ఇస్తే మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం చిత్తూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాలఏకరి చైర్మన్ కుమార్‌రాజ, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, డీవీఎంసీ సభ్యులు దేవరాజులు, మాలే గిరిధర్, మునీంద్ర నాయక్, మురగయ్య, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఎం.హరికృష్ణ అనే వ్యక్తిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అర్బన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గుడిపాల మండలంలో తనిఖీలు నిర్వహించగా.. పిళ్లారికుప్పంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న హరికృష్ణ వద్ద 96 టెట్రా మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వాటిని సీజ్ చేశారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి, రిమాండుకు తరలించినట్లు సీఐ జోగేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ పృథ్వి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం దిగువకండ్రిగ ప్రాంతంలో చెట్టును ద్విచక్రవాహనం ఢీకొన్ని ప్రమాదంలో అస్సాంకు చెందిన ఓ బాలుడు మృతి చెందాడు. బీఎన్ఆర్‌పేట ఎస్ఐ వెంకటసుబ్బమ్మ కథనం మేరకు ... అస్సాంకు చెందిన అమిత్(15) తల్లిదండ్రులు ఇక్కడ చికెన్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇంటి సరుకులు కొనేందుకు ద్విచక్రవాహనంలో అమిత్ బంగారెడ్డిపల్లెకు వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యమంలో దిగువ కండ్రిగ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్రగాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మళ్లీ జగనన్న పాలనే రావాలి


- శరీరానికి శూలాలు గుచ్చుకుని మొక్కు తీర్చుకున్న కార్యకర్త



శరీరానికి శూలాలు గుచ్చుకుని మొక్కు తీర్చేందుకు వెళుతున్న అంగముత్తు

నగరి : జగనన్న సుపరిపాలన 2024లోనూ కొనసాగాలని నగరి నియోజకవర్గం విజయపురం మండలం ఎల్లసముద్రం గ్రామానికి చెందిన అంగముత్తు ఆడికృత్తికను పురస్కరించుకుని శ్రీసుబ్రమణ్యస్వామిని వేడుకున్నాడు. బుధవారం తన శరీరమంతా ఇనుప శూలాలను పొడిపించుకుని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్కే రోజా చిత్రపటాలతో తిరుత్తణికి వెళ్లి శ్రీసుబ్రమణ్యస్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నాడు. సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్వామి వారిని వేడుకున్నట్లు అంగముత్తు తెలిపాడు.

వేగవంతంగా ఓటరు సర్వే



మాట్లాడుతున్న డీఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా డోర్ టు డోర్ ఓటర్ల సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు వెళ్లినప్పుడు బీఎల్‌వోలు కచ్చితంగా రాజకీయ పార్టీలు నియమించిన బీఎల్ఏలను తీసుకువెళ్లాలన్నారు. బీఎల్ఏ లు పరిశీలనకు రానిపక్షంలో వారికి వాట్సాప్ ద్వారా, ఇంటికి నోటీసును అతికించాలని చెప్పారు. వలంటీర్లను, ఇతరులను సర్వేకు తీసుకెళ్లకూడదన్నారు. జిల్లాలో 80 సంవత్సరాలకు పైబడిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారన్నారు. చనిపోయిన వారు ఉన్నట్‌లైతే సరైన ఆధారాలతో తొలగించాలని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఏ సమయంలోనైనా జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. విధుల పట్ల అలసత్వం లేకుండా పనిచేయాలని తెలిపారు. తప్పులు చేస్తే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌వో రాజశేఖర్, ఆర్డీవోలు రేణుక, సుజన, శివయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛీకరణ పూర్తి చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియను త్వరతిగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బీఎల్ఏలను పూర్తి స్థాయిలో నియమించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికీ ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతి చెందిన కేశవులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట-చౌడేపల్లె మార్గమధ్యంలోని సుద్దగుండ్లపల్లి బస్టాప్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు. మండలంలోని పెనుగొలకల గ్రామానికి చెందిన కదిరప్ప కుమారుడు జి.కేశవులు(25) చౌడేపల్లెలో ఓ డెకరేషన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణంలో పని పూర్తి చేసుకుని స్వగ్రామమైన పెనుగొలకలకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. సుద్దగుండ్లపల్లి బస్టాప్ సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో బుధవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని శ్రీరామాపురం గ్రామానికి చెందిన శంకరప్ప భార్య అమరావతి(48) బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమె టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. 6వ తేదీ సాయంత్రం దుకాణం మూసేసి ఇంటికి వెలుతుండగా, ముత్తుకూరు వైపు నుంచి పుంగనూరుకు వస్తున్న ద్విచక్ర వాహనం ఆమెను బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆమెను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం



సోమల: శివకుమార్‌తో పోలీసులు

సోమల: మిస్సింగ్ కేసులో యువకుడి ఆచూకీ గుర్తించినట్టు ఎస్ఐ వెంకట నరసింహులు బుధవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పెద్ద ఉప్పరపల్లెకు చెందిన శివకుమార్ బెంగళూరులో కూలీ పనులకని గత నెల 6వ తేదీ ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి అతని తల్లి అమరావతి అతనికి ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడం, బంధువుల ఇళ్లల్లో, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాంకేతిక పరిజ్ఞానంతో అతని ఆచూకి కనిపెట్టిన పోలీసులు బుధవారం మండల మెజిస్ట్రేట్ శ్యాంప్రసాద్ రెడ్డి ఎదుట హాజరు పరిచి తల్లి అమరావతికి అప్పగించారు. హెడ్ కానిస్టేబుళ్లు మధు, బాల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే యాదవులకు సముచిత స్థానం



ఆత్మీయ సభ పోస్టర్లను విడుదల చేస్తున్న వెంకటరెడ్డి యాదవ్, చంద్రారెడ్డి యాదవ్, నరసింహులు

- 14న పుంగనూరులో యాదవుల ఆత్మీయ సభ
- ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు
- పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యాదవులకు రాష్ట్రంలో పదవులను ఇచ్చి సముచిత స్థానం కల్పించారని, అందుకే యాదవుల ఐక్యతను చాటుతూ కృతజ్ఞతలు చెప్పనున్నట్లు పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. పట్టణంలో ఈనెల 14న వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక యాదవ సంఘం నాయకులు నరసింహులు, చంద్రారెడ్డి యాదవ్, వెంకట్రమణ యాదవ్, పాపిరెడ్డి యాదవ్‌తో కలసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాగానిపల్లె రోడ్డులోని జగనన్న కాలనీ మైదానంలో ఈ సమావేశం జరుగుతుందని, ముఖ్య అతిథిగా విద్యుత్, అటవీ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌యాదవ్‌తో పాటు రాష్ట్రంలోని యాదవ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని యాదవులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు జయరాం, వెంకటేష్, రెడ్డెప్ప, ఆంజప్ప, బాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వందే భారత్ రైలులో పొగలు

- మనుబోలు స్టేషన్‌లో 30 నిమిషాలు నిలిపివేత

మనుబోలు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న వందే భారత్ రైల్లోంచి హఠాత్తుగా పొగలు రావడంతో ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా మనుబోలు వద్ద రైలును 30 నిమిషాలు ఆపివేసిన ఘటన బుధవారం జరిగింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో రైలు మనుబోలు స్టేషన్ సమీపంలోకి వస్తుండగా ఓ బోగిలో నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన అధికారులు రైలును స్టేషన్‌లో నిలిపివేశారు. ఒక్కసారిగా రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు భయబ్రాంతులకు గురై కిందకు దిగేశారు. 3వ భోగీ బాత్‌రూం నుంచి పొగలు వస్తున్నాయని తెలుకుని సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఎవరో సిగరెట్ తాగి పడేయడంతో ప్లాస్టిక్ వస్తువులకు అంటుకుని పొగలు వచ్చినట్లు గుర్తించారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఆ పని చేసి ఉంటాడని అనుమానిస్తూ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అరగంట తర్వాత రైలు బయలుదేరింది.

కర్ణాటక మద్యం సీజ్



పట్టుబడిన మద్యం బాక్సులను చూపుతున్న సీఐ మద్దయ్య ఆచారి

చిత్తూరు అర్బన్: నగరంలో విక్రయించడానికి సిద్ధం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో బుజ్జమ్మ (42) అనే నిందితురాలిని అరెస్టు చేశారు. బుధవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మద్దయ్య ఆచారి వివరాలను వెల్లడించారు. కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి చిత్తూరులో విక్రయిస్తున్నారని డీఎస్పీ శ్రీనివాసమూర్తికి సమాచారం అందింది. డీఎస్పీ ఆదేశాలతో టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి, ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఉదయం తంగవేలు కాలనీ సమీపంలో టాటాఏస్ వాహనం నుంచి మద్యం బాక్సులు దింపుతున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా బుజ్జమ్మ అనే మహిళను పట్టుకున్నారు. రూ.1.42 లక్షల విలువ చేసే 53 బాక్సుల కర్ణాటక మద్యం, లగేజీ ఆటోను పోలీసులు సీజ్ చేశారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. పరారీలో ఉన్న విస్సు, మధు అనే ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది హరిప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా తపాశాఖలో తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన పూతలపట్టు మండలానికి చెందిన యుగంధర్, లావణ్య అనే ఇద్దరిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. తపాలాశాఖలో గ్రామీణ డాక్‌సేవ (జీడీఎస్) పోస్టుల భర్తీ కోసం 2021లో వెలువడిన నోటిఫికేషన్‌కు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా చిత్తూరు తపాలాశాఖలో నియామకాలు చేపట్టారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను విజయవాడలోని పాఠశాల విద్యాశాఖకు పంపగా.. యుగంధర్, లావణ్య అనే ఇద్దరు అందజేసిన పదో తరగతి మార్కుల జాబితా కలర్ జిరాక్స్‌గా తేలింది. ఇద్దరు అభ్యర్థులకు పదో తరగతిలో 9.2, 9.3 గ్రేడింగ్ మార్కులు రాగా, వీళ్ల సర్టిఫికెట్లను కలర్ జిరాక్స్ తీసి, అందులో 10, 10 గ్రేడింగ్ మార్కులుగా ఉద్యోగాలు పొందినట్లు అధికారులు తేల్చారు. ఈ మోసాలపై 'సాక్షి' దినపత్రికలో గతనెల 11వ తేదీన 'రాంగ్ పోస్ట్' శీర్షికన కథనం ప్రచురితమైంది. 2022 ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది జూన్ వరకు చిత్తూరు నార్త్ పోస్టల్ డివిజన్‌లో ఉద్యోగాలు చేసిన ఇద్దరినీ ఈ ఏడాది జూన్ 13వ తేదీన అధికారులు తొలగించారు. తపాలాశాఖను మోసం చేసిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ అధికారి విద్యావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు మహిళా దొంగలు అరెస్ట్

- రూ. 2లక్షల విలువైన నాలుగు తులాల బంగారు, 42 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం

కడప అర్బన్ (వైఎస్సార్ జిల్లా): కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాయల్ థియేటర్ సమీపంలో ఉన్న ఇద్దరు మహిళా దొంగలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2లక్షలు విలువైన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 42 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ ఎస్.వి.నాగరాజు వివరాలను వెల్లడించారు.

ఈ ఏడాది జనవరి 30న చిత్తూరు జిల్లా విజయపురం మండలానికి చెందిన ముదిరెడ్డి మల్లీశ్వరి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన అత్తగారి ఊరైన పెండ్లిమర్రి మండలం, మర్రిమాకుల పల్లెకు వెళ్లేందుకు కడపకు వచ్చింది. ఆ ఊరికి వెళ్లేముందు తన బిడ్డలకు దుస్తులు కొనేందుకు తన తండ్రితో కలిసి వై.వి స్ట్రీట్‌కు వెళ్లింది. అక్కడ తన బిడ్డల దుస్తుల కోసం షాపింగ్ చేసి, వై.వి స్ట్రీట్‌లో ఉన్న వేపచెట్టు వద్ద తన తండ్రి కోసం వేచి ఉంది. ఇంతలో ఎవరో గుర్తు తెలియని దొంగలు తన భుజానికి ఉన్న బ్యాగ్‌ను కత్తిరించి అందులో ఉన్న 7 తులాల బంగారు, వెండి ఆభరణాలు, రూ. 7000 నగదును దొంగిలించుకుని వెళ్లారు. దీంతో ఆమె అదే నెల 31న కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిలో భాగంగా తమకు వచ్చిన సమాచారం మేరకు కడప రాయల్ థియేటర్ సమీపంలో ఉన్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కర్నూలు జిల్లా సిద్ధాంతపురానికి చెందిన తమ్మిశెట్టి వాణి, గుంటూరు జిల్లా బాపట్ల మండలం, అరవపాలెం గ్రామానికి చెందిన గోదారి బుజ్జి ఉన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన కడప వన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు, ఎస్ఐ సిద్దయ్య, ఏఎస్ఐ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు ఖాదర్, బాషాలను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.